క్లుప్తంగా

108లో గర్భిణి ప్రసవం



108లోనే ప్రసవించిన బత్తుల నాగమణి

పుల్లలచెరువు: 108లో గర్భిణి ప్రసవించి తల్లీ,బిడ్డ క్షేమంగా ఉన్నారు. ఈ సంఘటన మండలంలోని గండిబావిగిరిజన గూడెంలో గురువారం జరిగింది. గండిబావిగిరిజన గూడేనికి చెందిన బత్తుల నాగమణి పురిటి నొప్పులతో బాధపడుతుండటంతో బంధువులు 108కి ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది యర్రగొండపాలెం నుంచి గండిబావిగూడెం వచ్చి గర్భిణిని వైద్యశాలకు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో నొప్పులు అధికంగా ఉండటంతో 108 ఈఆర్‌సీపీ ఆదేశాలపై ప్రథమ చికిత్స చేసి అంబులెన్స్‌లోనే కాన్పు చేశారు. ఆమె పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ,బిడ్డ క్షేమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు ఈఎంటీ మెనిబెరా మార్క్, పైలట్ కిశోర్‌కుమార్‌లకు అభినందనలు తెలిపారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పుల్లలచెరువు: మండలంలోని శతకోడులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మరియదాసు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొంటారని, అధికారులు, నాయకులు తప్పని సరిగా హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

కంభం: గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు ఆధ్వర్యంలో కంభం–4 సచివాలయం పరిధిలోని అర్బన్ కాలనీలో శుక్రవారం ఉదయం 10 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సయ్యద్ జాకీర్ గురువారం తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

కొమరోలు: గ్రామ సచివాలయాలకు వచ్చిన ప్రజల సమస్యలపై నిర్లక్ష్యం వద్దని ఎంపీడీవో డి.నరసయ్య సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం మండలంలోని గ్రామ సచివాలయ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో జగనన్న కాలనీలు, జగనన్న సురక్ష పథకాలపై రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఎంపీడీవో నరసయ్య మాట్లాడుతూ మండలంలో జగనన్న సురక్ష ద్వారా దరఖాస్తు చేసుకున్న అర్హులకు ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని తెలిపారు. జగనన్న కాలనీల్లో నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులతో త్వరితంగా నిర్మింపచేసి 100 శాతం పూర్తి చేయాలన్నారు. తహసీల్దార్ రమాదేవి, హౌసింగ్ ఏఈ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయం తనిఖీ

గిద్దలూరు రూరల్: మండలంలోని కె.ఎస్.పల్లె గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని మార్కాపురం డివిజన్ పంచాయతీ కార్యదర్శి నాగేశ్వర రావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. పంచాయతీ నిధుల వినియోగంలో పలు అక్రమాలు జరిగాయని కలెక్టర్‌కు ఫిర్యాదులు వెళ్లడంతో ఆయన వాటిపై నివేదికలు సమర్పించేందుకు గ్రామ పంచాయతీ కార్యాలయంలోని రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట ఈఓఆర్డీ చెన్నారావు, కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

ఎన్ఎస్పీ కాలువపై సర్వే

ముండ్లమూరు (తాళ్లూరు): తూర్పు గంగవరంలోని ఎన్ఎస్పీ కాలువపై తహసీల్దార్ కేవీ ప్రసాద్ గురువారం సర్వే చేపట్టారు. ఇటీవల దర్శి ఎన్ఎస్పీ కాలువలో బస్సు బోల్తా పడిన విషయం తెలిసిందే. దీంతో ప్రమాదాల నివారణను దృష్టిలో పెట్టుకుని సర్వే చేస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు. సర్వేయర్ చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

దర్శి: రోడ్డు ప్రమాదంలో శింగంశెట్టి శేషయ్య అనే వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మోడల్ స్కూల్ సమీపంలో గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. చందలూరుకు చెందిన శేషయ్య తన మోటారు సైకిల్‌పై వెళ్తున్నాడు. వెనుక నుంచి వస్తున్న మోటారు సైకిల్ ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి శేషయ్య మోటారు సైకిల్‌ను ఢీకొట్టారు. శేషయ్య కాలికు తీవ్ర గాయమైంది. క్షతగాత్రుడిని 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రేపటి నుంచి డివిజన్ స్థాయి షటిల్ పోటీలు

త్రిపురాంతకం: మార్కాపురం డివిజన్ స్థాయి షటిల్ పోటీలు శనివారం సాయంత్రం ప్రారంభమవుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక బీటీఆర్‌సీ ఇండోర్ స్టేడియంలో పోటీలు జరగనున్నాయి. వినుకొండ క్రీడాకారులకు ప్రత్యేక ఆహ్వానం ఉన్నట్లు తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. వివరాలకు 8328245662, 8555941840 నంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

అందుబాటులో ఎరువులు

తర్లుపాడు: మండలంలోని తుమ్మలచెరువు సచివాలయంలో రైతులకు అవసరమైన ఎరువులు సబ్సిడీపై అందిస్తున్నట్లు ఏఓ టి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఆధార్ కార్డు, పాస్‌బుక్ జిరాక్స్ కాపీలతో ఆర్బీకేలో సంప్రదించాలని కోరారు.

వలంటీర్లకు వందనం

సంక్షేమ పథకాలకు అర్హులను గుర్తించి దరఖాస్తు చేయించడం, ఆపద సమయాల్లో అండగా నిలవడం, ఒకటో తేదీ తెల్లవారుజామునే అవ్వాతాతల తలుపుతట్టి పింఛను డబ్బు చేతికందించి వారి ఆశీస్సులు పొందడం.. ఇదీ వలంటీర్ల పని. వాస్తవానికి వలంటీర్లు చేస్తున్నది పనికాదు సమాజసేవ. కేవలం రూ.5 వేల గౌరవ వేతనం తీసుకుంటున్న వలంటీర్లు కరోనా విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలు సైతం లెక్క చేయకుండా ప్రజలకు అండగా నిలిచి మన్ననలు పొందారు.

గతంలో పింఛన్ కోసం పడిగాపులు

నా పేరు ఆర్లగడ్డ పెద్దక్క, నేకునాంబాద్ ఎస్సీ కాలనీలో జీవిస్తున్నా. గతేడాది గుండెపోటుకు గురికావడంతో కర్నూల్ కిమ్స్‌లో చికిత్స పొందా. ఆరోగ్యశ్రీలో ఉచితంగా గుండె ఆపరేషన్ చేయించుకున్నా. అప్పట్లో వితంతు పింఛన్ రూ.2500 వలంటీర్ గవ్వల శివనాగరాజు సొంత ఖర్చులతో కర్నూల్ వచ్చి పింఛన్ నగదు అందచేశాడు. గతంలో పింఛన్ కోసం పంచాయతీ కార్యాలయం వద్ద గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి. నేడు వలంటీర్ ఇంటికొచ్చి పింఛన్ అందచేస్తున్నాడు. వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పటికీ రుణపడి ఉంటాం.



పెద్దక్కకు పింఛన్ ఇస్తున్న వలంటీర్ శివనాగరాజు

వైద్యం చేయించాడు



కరోనా సమయంలో గ్రామంలో పనులు లేక 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న వేములపాడులోని జామాయిల్ తోటలో కూలీకి వెళ్లా. పని ముగిశాక మధ్యాహ్నం 2 గంటలప్పుడు స్కూటర్‌పై ఇంటికి వస్తూ తాడివారిపల్లి ఘాట్ సమీపంలో కళ్లు తిరిగి రోడ్డుపై పడిపోయా. తలకు బలమైన గాయమైంది. అతి కష్టంమీద ఇంటికి చేరుకుని నొప్పి భరించలేక పడిపోయాను. నా పిల్లలు ఆ సమయంలో బయట ప్రాంతంలో ఉన్నారు. విషయం తెలుసుకున్న మా వలంటీర్ విజయ్‌కుమార్ ఇంటికి వచ్చి ఆటోలో మార్కాపురం జిల్లా వైద్యశాలకు తీసుకెళ్లి కుట్లు వేయించి, మందులు ఇప్పించి తిరిగి ఆటోలో ఇంటికి తీసుకొచ్చాడు. కరోనా సమయంలో ఒకరికొకరు సహాయం చేసుకోలేని పరిస్థితుల్లోనూ నాకు సాయం చేశాడు. వలంటీర్ల వల్ల ప్రజలకు మంచి జరుగుతోంది. ఈ వ్యవస్థ ఏర్పాటు చేసిన సీఎం జగన్‌కు ధన్యవాదాలు.

– జయంపు అల్లూరయ్య, తాడివారిపల్లి

జగనన్నను మళ్లీ సీఎం చేద్దాం..

- ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు
- రూ.2.10 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



సిమెంటు రోడ్డు నిర్మాణం కోసం శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

రాచర్ల: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో పాటు గ్రామాలు నిరంతరం అభివృద్ధి చెందాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేద్దామని ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అన్నారు. వివిధ గ్రామాల్లో రూ.2.10 కోట్లతో విలువైన అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమానికి గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆరవీటికోటలో సిమెంటు రోడ్డు నిర్మాణం కోసం రూ.20 లక్షలు, ఆకవీడులో రూ.25 లక్షలు, జేపీ చెరువులో రూ.20 లక్షలు, చోళ్లవీడులో రూ.5 లక్షలు, పలుగుంటిపల్లెలో రూ.70 లక్షలు, అనుములపల్లెలో రూ.55 లక్షలు, ఓబుల్‌రెడ్డిపల్లెలో రూ.10 లక్షలతో సిమెంటు రోడ్ల నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో ఎక్కడా అభివృద్ధి జరగలేదని, ప్రస్తుతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా నవరత్నాలతో అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు గ్రామాల్లో అభివృద్ధి జరిగిందన్నారు. అందుకే మళ్లీ జగనన్నను మళ్లీ సీఎం చేసుకోవాలని ఎమ్మెల్యే అన్నా పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యేలం మురళీకృష్ణ, రాచర్ల, ఆకవీడు, చోళ్లవీడు, అనుములపల్లె, అనుమలవీడు సర్పంచ్‌లు సగినాల రాయలమ్మ, తలపాటి దేవదానం, నారాయణ, రమేష్, లతీఫ్, జేసీఎస్ మండల కన్వీనర్ బెల్లం నాగిరెడ్డి, రామాపురం సొసైటీ అధ్యక్షుడు మదిరె శ్రీరంగరెడ్డి, నెమలిగుండ్లరంగనాయకస్వామి దేవస్థానం చైర్మన్ కన్నసాని ఓబులేసు, వైఎస్సార్ సీపీ నాయకులు పగడాల శ్రీరంగం, సూర పాండురంగారెడ్డి, అన్నా రంజిత్, మదిరె నెమిలిరెడ్డి, ఎంపీటీసీలు నందం రవి, సుబ్బారాయుడు, పి.కమలాదేవి, ఎంపీడీవో కె.కవితాచౌదరి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మృతి



థామస్ (ఫైల్)

కొనకనమిట్ల: వైఎస్సార్ సీపీ కొనకనమిట్ల మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బూదాల థామస్ గురువారం మృతి చెందారు. వాగుమడుగు పంచాయతీలోని బోడపాడు గ్రామానికి చెందిన థామస్ మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి సందర్శించి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. థామస్ పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో ఎంపీపీ ఎం.మురళి, సొసైటీ బ్యాంకు డైరెక్టర్ కామసాని వెంకటేశ్వరరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ ఎస్.పెద్ద వెంకటరెడ్డి, పార్టీ నాయకులు బాలయ్య, లక్ష్మీ వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉడుముల

సమస్యలపై కలిసికట్టుగా పోరాటం



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ నాగిరెడ్డి

కురిచేడు: మండలంలోని సమస్యలపై కలిసికట్టుగా పోరాటం చేసి పరిష్కరించుకుందామని జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ బెల్లం కోటేశ్వరమ్మ అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. జెడ్పీటీసీ మాట్లాడుతూ ఇప్పటికే మండలానికి ఒక జూనియర్ కళాశాల, రెండు పీటీఆర్‌లు, ఒక విద్యుత్ సబ్‌స్టేషన్ సాధించుకున్నామని పేర్కొన్నారు. మండలంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, సాగర్ నీరు కూడా రాకపోవడంతో తాగునీటి చెరువులు ఎండిపోయాయని పేర్కొన్నారు. గ్రామాల్లో నీటి వనరులను గుర్తించి వాటిని సద్వినియోగం చేసుకునేందుకు చర్యలు తీసుకుందామని చెప్పారు. మండల ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు జేజేఎం కింద రూ.25 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. నాడు–నేడు కింద పనులు పూర్తయిన పాఠశాలలకు ఐఎఫ్‌పీ డిజిటల్ పాఠాలు బోధించే విధంగా స్క్రీన్‌లు ప్రభుత్వ పాఠశాలలకు వచ్చినట్లు ఎంఈఓ–2 సీహెచ్ సుబ్బారావు తెలిపారు. అన్ని గ్రామాలకు 3 ఫేస్ విద్యుత్ సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఏఈ సుబ్బారెడ్డి తెలిపారు. పెద్దచెరువును తాగునీటి చెరువుగా మార్చి తాగునీటి సమస్య తీర్చాలని ఎంపీటీసీ బుల్లం వెంకట నర్సయ్య కోరారు. తహసీల్దార్ మిడసల జ్వాలా నరసింహం, ఎంపీడీఓ వసంత రావు నాయక్, డిప్యూటీ తహసీల్దార్ రాధాకృష్ణ, ఈఓఆర్డీ ఆర్‌వీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి పలువురు విద్యార్థుల ఎంపిక



గువ్వా రేణుక



భానుప్రసాద్



సరస్వతి, అభిరామ్ నాయక్, అమరేశ్వరదేవి



డి.హస్మితబాయి

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి మీనిగ వెంకటసాయి విశ్వనాథ్ నూజివీడు ట్రిపుల్ ఐటీ, ఇమ్మడి కిరణ్ ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించినట్లు హెచ్ఎం చంద్రశేఖర్‌రెడ్డి గురువారం తెలిపారు. అలాగే కమలా కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు డి.హస్మితబాయి, పి.సాయి రాఘవేంద్రరెడ్డి ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎంపీ పుల్లయ్య తెలిపారు. వీరిని కళాశాల కరస్పాండెంట్ పవన్‌కుమార్ అభినందించారు.

గిద్దలూరు రూరల్: మండలంలోని ముండ్లపాడు గంజి భద్రయ్య మెమోరియల్ ట్రస్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలో చదువుకునే అవకాశం దక్కినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పరీక్షల్లో 600 మార్కులకు ఆర్.సరస్వతికి 571, ఎం.అభిరామ్‌నాయక్‌కు 556, పి.అమరేశ్వరదేవికి 551 మార్కులు వచ్చినందున ట్రిపుల్ ఐటీ చదువుకునే అవకాశం దక్కింది. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయులతో పాటు పలువురు ఉపాధ్యాయులు ప్రశంసించారు.

కురిచేడు: మండలంలోని బోధనంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గతేడాది 10వ తరగతి విద్యార్థి కనమల భానుప్రసాద్‌కు ట్రిపుల్ ఐటీ సీటు లభించింది. 2022–23 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో పాఠశాల, మండల స్థాయిలో మొదటి ర్యాంకు, నియోజకవర్గ స్థాయిలో తృతీయ ర్యాంకు సాధించాడు. ఆర్‌జీయూకేటీ ట్రిపుల్ ఐటీ ఫలితాల్లో ఇడుపులపాయ కళాశాలలో సీటు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాపారావు తెలిపారు. విద్యార్థి భానుప్రసాద్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాపారావు, ఉపాధ్యాయులు అభినందించారు.



రాఘవేంద్రారెడ్డి

రాచర్ల: మండల కేంద్రం రాచర్లలోని స్పందన హైస్కూల్లో 2023 సంవత్సరంలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 575 మార్కులు సాధించిన ఆకవీడు గ్రామానికి చెందిన గువ్వా రేణుకకు గురువారం ప్రకటించిన ప్రతిష్టాత్మక ట్రిపుల్ ఐటీ మెరిట్ లిస్టులో నూజివీడు క్యాంపస్‌లో సీటు సాధించింది. స్పందన విద్యా సంస్థల డైరెక్టర్ పేర్ల సుధీర్‌కుమార్, ఉపాధ్యాయులు రేణుకను ప్రత్యేకంగా అభినందించారు.

ఉత్పత్తిదారుల సంఘాలతో బహుళ ప్రయోజనాలు



సూచనల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అధికారులు

పొదిలి: రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో వ్యవసాయంలో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని ఆత్మ పీడీ, జిల్లా వనరుల కేంద్రం హెడ్ కె.అన్నపూర్ణ పేర్కొన్నారు. గురువారం పొదిలి మండలంలోని పాములపాడు, మాదాలవారిపాలెం రైతు భరోసా కేంద్రాల్లో ఖరీఫ్ సీజన్‌పై సంఘాల సభ్యులకు యాజమాన్య పద్ధతుల గురించి అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మ పీడీ మాట్లాడుతూ.. ఆయా పంటలకు సంబంధించి వేర్వేరుగా గ్రూపులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. విత్తన ఎంపిక, విత్తన శుద్ధి, మొలక శాతం, పురుగులు–తెగుళ్లు, మందుల పిచికారీ, మార్కెటింగ్ లాంటి విషయాల్లో గ్రూపు మొత్తం ఏకాభిప్రాయంతో నిర్ణయాలు తీసుకోవడం ద్వారా మేలు కలుగుతుందన్నారు. వ్యవసాయాధికారి షేక్.జైనులాబ్దిన్ మాట్లాడుతూ.. గత సంవత్సరం ఏ పైరులో ఎటువంటి చీడపీడలు ఆశించాయి, సస్య రక్షణ ఎలా చేశామో పరిశీలించుకుని, ఈ ఏడాది మరింత మెరుగ్గా సస్య రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఉద్యానవన శాఖాధికారి సంధ్య మాట్లాడుతూ.. బొప్పాయి, మిర్చి పంటల్లో యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో దర్శి ఏడీఏ నాయక్, రైతులు పాల్గొన్నారు.

నర్సరీ యజమానులకు లైసెన్స్ తప్పనిసరి



రైతులతో మాట్లాడుతున్న ఉద్యాన శాఖ అధికారులు

త్రిపురాంతకం: నర్సరీ యజమానులంతా తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతి కోసం రిజిస్టర్ చేసుకోవాలని ఉద్యాన శాఖ అధికారి పి.ఆదిరెడ్డి తెలిపారు. మండలంలోని శ్రీనివాసనగర్ సమీపంలోని షేడ్‌నెట్ నర్సరీలను ఆయన తనిఖీ చేశారు. నర్సరీల్లో పెంచే విత్తనాలను ఆథీకృత డీలర్ల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. వాటికి తగిన బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలని చెప్పారు. నర్సరీ యాక్ట్ ప్రకారం సీడ్స్ రిజిస్టర్, సేల్స్ రిజిస్టర్, ఇన్‌స్పెక్షన్ రిజిస్టర్ ప్లాంట్ ప్రొటెక్షన్ రిజిస్టర్ తప్పనిసరిగా వినియోగించాలన్నారు. తనిఖీల్లో పది నర్సరీల్లో కొనుగోలు చేసిన విత్తనాల బిల్లులు పరిశీలించారు. రైతులు తప్పనిసరిగి బిల్లులు తీసుకోవాలన్నారు. ఈయన వెంట వ్యవసాయ సహాయకులు గోపీకృష్ణ ఉన్నారు.

కంభం: రైతులకు మొక్కలు విక్రయించే సమయంలో తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని ఏపీఎంఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ పీవీ రమణ, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి గోపీచంద్ సూచించారు. గురువారం మండలంలోని పలు నర్సరీలను వారు తనిఖీ చేశారు. హజరత్‌గూడెం పరిధిలోని నర్సరీలో రిజిస్టర్‌లు, రసీదులను పరిశీలించారు. చీడపీడలు లేని నాణ్యమైన మొక్కలు రైతులకు విక్రయించాలన్నారు. సెంట్ నారుమడిలో 150 గ్రాముల ఫిరడాన్ గుళికలు తప్పనిసరిగా వేయాలని, దీంతో మొక్కలు విషతుల్యమవుతాయని, నారుమడిలో రసం పీల్చే పురుగులు నివారించవచ్చని తెలిపారు. ఉద్యానవన శాఖ అధికారి శ్వేత పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: ఉద్యానవన పంట రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందిస్తోందని జిల్లా ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ పీవీ రమణ అన్నారు. మండలంలోని మోడంపల్లెలో కలెక్షన్ సెంటర్, గడికోట గ్రామ పంచాయతీ పరమేశ్వరనగర్ మామిడి తోటలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఉద్యానవన పంట రైతులకు కల్పిస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు. ఆయన వెంట జిల్లా ఉద్యానవన అధికారి గోపీచంద్, మండల అధికారి శ్వేత ఉన్నారు.

గృహనిర్మాణ లక్ష్యాలు అధిగమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈ నిరీక్షణరావు

ముండ్లమూరు: నిర్దేశించిన గృహనిర్మాణ లక్ష్యాలను వేగవంతంగా పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ నిరీక్షణరావు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం హౌసింగ్ సిబ్బంది, సచివాలయం ఇంజినీర్లతో ఆయన సమావేశమయ్యారు. నిరీక్షణరావు మాట్లాడుతూ గ్రామాల్లో జూలై చివరి నాటికి గృహాలు పూర్తి చేయాలన్నారు. వాటితో పాటు వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలకు బిల్లులు చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా లబ్ధిదారులతో ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయించాలని చెప్పారు. ఏఈ సీహెచ్ హనుమంతరావు, వర్క్ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



తర్లుపాడు: స్థానిక హిందూ శ్మశానవాటికలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నూతనంగా భవనం, డీప్ బోరు నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు జగన్‌బాబు, భాస్కర్‌రావు, శేషగిరి, మల్లికార్జున రావు, నేరేళ్ల కృష్ణ, సూరె ఆంజనేయులు, అర్చకులు పవన్‌కుమార్ శర్మ, రత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కలిసి పనిచేయాలి



మాట్లాడుతున్న వీహెచ్‌పీ నేత గుమ్మళ్ల సత్యం

త్రిపురాంతకం: హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి హిందువు సమన్వయంతో కలిసి పనిచేయాలని వీహెచ్‌పీ అఖిల భారత సహాయ కార్యదర్శి గుమ్మళ్ల సత్యం పేర్కొన్నారు. స్థానిక వీహెచ్‌పీ ధర్మ ప్రసార విభాగం మార్కాపురం డివిజన్ శిక్షణ తరగతులు రెండు రోజులు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీహెచ్‌పీ ప్రారంభమై 60 ఏళ్లు గడిచిందన్నారు. దేశవ్యాప్తంగా గ్రామగ్రామాన వీహెచ్‌పీ కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో విశ్వహిందూ పరిషత్ కమిటీలు వేయాలని సూచించారు. అన్ని గ్రామాల్లో సత్సంగ్ జరిగేలా చూడాలన్నారు. పిల్లలకు మన సంస్కృతి సంప్రదాయాలు అందించాలన్నారు. హిందువులంతా సోదర భావంతో సమరసత కోసం పనిచేయాలన్నారు. అంటరానితనాన్ని తరిమికొట్టాలని పిలుపు నిచ్చారు. వీహెచ్‌పీ రాష్ట్ర సహాయ కార్యదర్శి కోటేశ్వరరావు, ధర్మ ప్రసార రాష్ట్ర ప్రముఖ్ అనంత విశ్వప్రసాద్, సహ ప్రముఖ్ అంకాలయ్య, గోరక్ష ప్రముఖ్ పి.బ్రహ్మానందరెడ్డి, జిల్లా ప్రముఖులు వీరారావు, రమణ, నాగిరెడ్డి, రమణారెడ్డి, గురుస్వామి, గురవరెడ్డి, అల్లూరురెడ్డి, వీరపనాయుడు పాల్గొన్నారు.

545 మందికి వైద్య పరీక్షలు

అర్ధవీడు (కంభం): డాక్టర్ బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో గురువారం మండలంలోని మాగుటూరులో వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యశిబిరంలో 545 మంది రోగులను పరీక్షించగా 143 కంటి శస్త్ర చికిత్సలు, 9 మందికి ఈఎన్‌టీ శస్త్ర చికిత్సలు, ఏడుగురికి సాధారణ శస్త్ర చికిత్సలు అవసరమని సూచించారు. రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తున్నారు..



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న అబ్బాయిపాలెం గ్రామస్తులు

దర్శి: ప్రభుత్వ భూమితో పాటు దారిని కూడా ఆక్రమించి ఇదేమని అడిగితే మీకు దిక్కు ఉన్న చోట చెప్పుకోమంటున్నారని అబ్బాయిపాలెం గ్రామానికి చెందిన ఎం.శ్రీనివాసరెడ్డి, అన్నెం మోగిరామిరెడ్డి తదితర గ్రామస్తులు తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చిన అనంతరం వారు మాట్లాడుతూ తమ పూర్వీకులు అబ్బాయిపాలెం గ్రామ సర్వే నంబర్ 258లో 330.00 సెంట్లు భూమిలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పశువులు, జీవాలు మేపుకుంటున్నారు. కురిచేడు మండలం బోధనంపాడు గ్రామానికి చెందిన పుల్లల చెర్వు రామాంజనేయులు అనే వ్యక్తి అనాదీనం భూములను ఇతరుల వద్ద కొనుగోలు చేసి జేసీబీతో చదును చేసుకుని సాగు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాడన్నారు. అంతేగాక తాము కొండకు వెళ్లే బాటను కూడా ఆక్రమించుకున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.